## కొనసాగుతున్న ఆర్టిజన్ల రిలే దీక్షలు



హనుమకొండలో దీక్షలో పాల్గొన్న ఆర్టిజన్ ఉద్యోగులు

హనుమకొండ/గణపురం, జనవరి 21: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. హనుమకొండ, చెల్పూర్ కేటీపీపీలో చేస్తున్న దీక్షలకు తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ, డీఈ ముడిదె వెంకటేశ్వర్లు, రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఎంఏ వజీర్, స్టేట్ ఫైనాన్షియల్ సెక్రటరీ సుంకర సదానందం హాజరై సంఘీభావం తెలిపారు. దీక్షలకు వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు 1535 కేటీపీపీ రీజినల్ అధ్యక్షులు శ్రీనివాస్, వేణు, సీఐటీయూ జెన్కో సెక్రటరీ చిలువేరు మల్లయ్య, రీజినల్ జేఏసీ నాయకులు కోల శ్యాం, వౌనపాకల సంపత్, కోశాధికారి మణి మద్దతు పలికారు.

## ప్రజారోగ్యంలో ఫార్మసీ రంగం కీలకం

- కేయూ కళాశాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు
- వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి
- కేయూలో అంతర్జాతీయ వర్క్‌షాప్




మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, జనవరి 21: ప్రజారోగ్య సంరక్షణలో ఫార్మసీ రంగం కీలకమని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ నేతృత్వంలో మంగళవారం 'డ్రగ్ డిస్కవరీ ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్' అనే అంశంపై ఒకరోజు అంతర్జాతీయ వర్క్‌షాప్ సెనేట్ హాల్లో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ మానవ మనుగడలో ఫార్మాసిస్టుల పాత్ర గొప్పదని, రోజురోజుకూ విజృంభిస్తున్న అనేక రోగాలకు నూతన ఔషధాలు కనుక్కొని ప్రాణాలు కాపాడుతున్నారని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రూ.12కోట్లతో పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఫార్మసీలో పరిశోధనలను ప్రోత్సహిస్తానని వెల్లడించారు. వర్క్‌షాప్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీ మల్లారెడ్డి, ఫార్మసీ విభాగం ప్రొఫెసర్లు, రిటైర్డు ప్రొఫెసర్లు సారంగపాణి, కిషన్, అచ్చయ్య పాల్గొన్నారు.

- రైతు భరోసా మాకెందుకు రాదని ఆగ్రహం
- సొంత ఊరిలోనే ఎదురైన చేదు అనుభవం



సోమ్లాతండా గ్రామసభలో ఎమ్మెల్యే మురళీనాయక్‌ను నిలదీస్తున్న గ్రామస్తులు

## ఎమ్మెల్యే మురళీనాయక్ నిలదీత

మహబూబాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌కు తన సొంత ఊరిలోనే చేదు అనుభవం ఎదురైంది. మంగళవారం మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం పర్వతగిరి గ్రామ పరిధిలోని సోమలతండాలో అధికారులు నిర్వహించిన గ్రామసభలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. అధికారులు లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు అర్హులుకాని వారి పేర్లు జాబితాలో వచ్చాయని, అర్హులైన తమవి ఎందుకు రాలేదని ఎమ్మెల్యేను నిలదీశారు. రైతు భరోసాకు తాము అర్హులం కాదా? అంటూ గ్రామసభ ప్రారంభం కాగానే ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. దీంతో అధికారులు ప్రజలకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా, గొడవ సద్దుమణుగలేదు. గ్రామస్తులు, మహిళలు ఎదురుతిరగడంతో చేసేదేమీ లేక ఎమ్మెల్యే మురళీనాయక్ అర్హులు ఎవరున్నా ఇక్కడే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నామని, ఎన్నిసార్లు అర్జీ పెట్టుకోవాలని ఎమ్మెల్యేతో వాగ్వాదానికి దిగారు. చివరకు గొడవ సద్దుమణగడంతో నియోజకవర్గ కేంద్రానికి ఎమ్మెల్యే బయలుదేరి వెళ్లారు.



పాలకుర్తి : కొండాపురం గ్రామసభలో రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

రచ్చ రచ్చ



శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామంలో అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయంటూ అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

# నిరసనలు.. నిలదీతలు

### ఆందోళనలతో హోరెత్తిన ఉమ్మడి జిల్లా పల్లెలు

- ప్రజాపాలన గ్రామసభల్లో లొల్లిలొల్లి
- పథకాల జాబితాల్లో పేర్లు లేవంటూ ప్రజల ఆగ్రహం
- అనర్హులకు చోటు కల్పించారంటూ మండిపాటు
- నామ్ కే వాస్తేగా కొనసాగిన సమావేశాలు
- ముందుగా నిర్ణయించిన పేర్లనే చదివి వినిపించిన అధికారులు
- లబ్ధిదారులు అడ్డుకోవడంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచన
- తూతూ మంత్రంగా నిర్వహించి వెనుదిరిగిన సిబ్బంది

*ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన గ్రామసభలు రచ్చ రచ్చగా మారాయి. అధికారుల నిలదీతలు.. నిరసనల హోరుతో అట్టుడికాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, లబ్ధిదారుల ఎంపిక కోసం ఏర్పాటు చేసిన గ్రామ సభల్లో ప్రజలు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పథకాల జాబితాలో తమ పేర్లు లేవని, అనర్హులను ఎంపిక చేశారని గ్రామస్తులు మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, ధనవంతులు, మృతి చెందిన వారి పేర్లు వచ్చాయని నిలదీశారు. భూమి ఉన్న వారికి కూడా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో పేర్లు ఉన్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి నచ్చిన వారి పేర్లను మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జాబితాలో చేర్చారని ఆరోపించారు. రాష్ట్రప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. అధికారులను ప్రజలు అడ్డుకోవడంతో పోలీసులు వారిని సముదాయించారు. నామ్ కే వాస్తేగా కొనసాగిన సమావేశాల్లో అధికారులు ముందే నిర్ణయించిన పేర్లను చదివి వినిపించారు. ప్రజలు అడ్డుకోవడంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించి తూ తూ మంత్రంగా ముగించి వెళ్లిపోయారు.*

*- నమస్తే నెట్‌వర్క్, జనవరి 21*



లింగాలఘనపురం : గ్రామసభలో అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు



మహబూబాబాద్ జిల్లా వేంనూరులో అధికారులను నిలదీస్తున్న ప్రజలు




నర్సంపేట : ఒకటో వార్డులో అధికారులను నిలదీస్తున్న పట్టణ మహిళలు



కోమటిపల్లి గ్రామసభలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కూరెళ్లి సతీశ్

## ఇది తాగి ఇంట్లో పడుకొని రాసిన జాబితా

### కోమటిపల్లిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడి ఆగ్రహం

ఇనుగుర్తి: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామసభలో అధికారులపై కాంగ్రెస్ నాయకుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా పథకాల జాబితాలు చదవగా రెండేళ్ల క్రితం మృతిచెందిన వారి పేర్లు, కోటీశ్వరుల పేర్లు ఉన్నాయని, ఇది పూర్తిగా పేదలకు అన్యాయం చేసేలా ఉందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కూరెళ్లి సతీశ్ మండిపడ్డారు. ఇది కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్, జీపీ సిబ్బంది తాగి ఇంట్లో పడుకొని రాసుకున్న లిస్ట్ అని, ఇంటింటికీ తిరిగి సర్వే చేయలేదని ఆరోపించారు. రీసర్వే చేసి అనర్హులను తొలగించి, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించాలని కోరారు. గ్రామానికి చెందిన చెరుకు సంజీవ, మంకు యాకయ్య, మటత్తమ్మల్ అలివేలమ్మ ఏడాదిన్నర క్రితం మృతిచెందగా, వారి పేర్లు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఉన్నాయంటే అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని సతీశ్ హెచ్చరించారు.



కాటారంలో అధికారులతో వాగ్వాదానికి దిగిన ప్రజలు, నాయకులు



నర్సింహులపేట : ఫకీరా తండాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే మళ్లీ చేపట్టాలని వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు



కాటారం : ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



చిట్యాల : గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

## అనర్హుడికి ఆత్మీయ భరోసా

### అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

గీసుగొండ, జనవరి 21 : వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మచ్చాపురం గ్రామంలో అనర్హుడికి 'ఆత్మీయ భరోసా'లో చోటుదక్కింది. మంగళవారం గ్రామంలో గ్రామసభ నిర్వహించగా, జాబితాలో వ్యవసాయ భూమి ఉన్న హర్షం మనోజ్ పేరు వచ్చింది. అధికారుల తీరుతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం ఎలా ఉందో తెలుస్తున్నదని మండిపడ్డారు. కాగా, మనోజ్ గ్రామ సభకు వచ్చి తనకు భూమి ఉందని, ఆత్మీయ భరోసా వద్దని అధికారులకు లిఖిత పూర్వకంగా రాసిచ్చాడు. దీంతో అధికారులు పేరు పరిశీలించి తొలగిస్తామని హామీ ఇచ్చారు.



కమలాపూర్ : గూడూరు గ్రామసభలో జాబితాలో తమ పేర్లు లేవని తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

### ఇప్పుడన్న రేషన్‌కార్డు ఇత్తరా?



ఇదివరకు ప్రజా పాలన గ్రామ సభలో రేషన్ కార్డు కోసం దరఖాస్తు పెట్టుకున్న. ఇత్తమని చెప్పింద్రు కాని ఇయ్యలె. రేషన్ కార్డు లేక ఏడాది కాలంగా ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలకు దూరమైన. దేనికైనా రేషన్ కార్డే అడుగుతున్నరు. ఇప్పుడు మల్ల దరఖాస్తు పెట్టుకున్న. ఇగనైన ఇత్తరో.. ఇయ్యరో సూడాలె. అన్ని ఉన్నోళ్లకే రేషన్ కార్డులు ఇత్తున్నరు.. ఏమి లేనోనికి ఇయ్యడానికి చేతులత్తలేవా?

– గంట శరత్ చంద్ర, దుబ్బగూడెం, కాటారం

### నాలాంటి పేదోళ్లకు ఇల్లిత్తే ఆసరైతది



కూలి నాలి చేసుకునేదాన్ని. సొంతిల్లు లేదు. గతంలో కూడా ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న. ఇప్పుడు మల్ల జేసుకున్న. ఇండ్లు ఉన్నోళ్లకే మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు ఇత్తున్నరు. ఏం లేని నాలాంటి పేద మహిళకు ఇత్తే ఆసరైతది గదా. ఇప్పుడన్న ఇందిరమ్మ ఇల్లు ఇత్తే మీ పేరు చెప్పుకుని బతుకుత.

– డోంగిరి అనసూర్య, కాటారం, జయశంకర్ భూపాలపల్లి



ధర్మసాగర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## అన్నదాతలపై కాంగ్రెస్ చిన్నచూపు

- అన్నీ ఉన్నా సాగునీరు ఇస్తలేరు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై రేవంత్ కుట్రలు
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బచ్చన్నపేట, జనవరి 21: కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలపై చిన్నచూపు చూస్తున్నదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొన్నెలో బీఆర్‌ఎస్ నేత, సామాజిక సేవా కార్యకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ గ్రామస్తులకు వెయ్యి వాటర్ క్యాన్లను ఇవ్వాలని నిర్ణయించుకోగా వాటిని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా శివకుమార్‌ను అభినందించారు. అనంతరం పల్లా మాట్లాడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇదే సమయంలో చెరువులన్నీ జలకళతో ఉట్టిపడ్డాయని, నేడు ఎండిపోయి వెక్కిరిస్తున్నాయని అన్నారు. గోదావరి నీళ్లు పుష్కలంగా ఉన్నా కరువు ప్రాంతమైన బచ్చన్నపేట మండలానికి తరలించడం లేదన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రతి నియోజకవర్గానికి రూ.5కోట్లు కేటాయిస్తే, నేడు ఒక్క పైసా మంజూరు కాలేదన్నారు. అసెంబ్లీలో అడిగితే ఇస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అయినందున చెరువులు నింపడం లేదని, విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. రోడ్ల కోసం సంబంధిత మంత్రి వద్దకు వెళ్లి నిధులు తీసుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. సీఎం అంటే అందరూ నా వాళ్లు అనుకోవాలే తప్ప, పార్టీల పేరుతో పక్కన పెట్టడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు బావండ్ల కృష్ణంరాజు, సిద్దిరాములు, వేముల విద్యాసాగర్‌గౌడ్, రామాంజనేయులు, ముశిని రాజుగౌడ్, దూడల కనుకయ్యగౌడ్, వేముల లక్ష్మణ్‌గౌడ్, కొప్పురపు సిద్ధారెడ్డి, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, అంబాల క్రాంతికుమార్, ఎంటె శ్రీనివాస్, చెవిటి శ్రీకాంత్, ఇటికాల అభినయ్, తేలు శ్రీనివాస్, పిట్టల శివకుమార్, కిషన్, స్వామి, యాట రామచంద్రయ్య పాల్గొన్నారు.

## రైతులకు ద్రోహం చేసిన సర్కారు

- హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ మోసం
- రైతు ధర్నాలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు, జనవరి 21: కాంగ్రెస్ పార్టీ రైతులకు ద్రోహం చేసిందని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. జనగామ జిల్లా చిల్పూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో మంగళవారం నిర్వహించిన రైతు ధర్నాలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిందన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయకపోవడం, హామీలను కేవలం ప్రచార హోదాలో పరిమితం చేయడం కాంగ్రెస్ అసమర్థతకు నిదర్శనంగా నిలుస్తున్నదని విమర్శించారు. రైతు భరోసా కింద రూ.15,000 వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పక్కదోవ పట్టించే కాంగ్రెస్ పార్టీ తీరుపై ప్రజలు గట్టిగా స్పందించాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి తక్షణమే రాజీనామా చేసి నియోజకవర్గ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. రైతు సమస్యలు పరిష్కరించకుంటే కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి కృష్ణారెడ్డి, నియోజకవర్గ ఆఫీస్ ఇన్‌చార్జి ఆకుల కుమార్, కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు బత్తుల రాజన్‌బాబు, రంగు హరీశ్, గ్రామ శాఖ అధ్యక్షుడు వెన్నం మాధవరెడ్డి, రచ్చ రవీందర్, అరూరి స్వామి, మండల నాయకులు కుమారస్వామి, నలిమెల రజినీకర్, మంతెన రాజు, రాజబాబు, చిర్ర రాజు, వెంకటస్వామి, ఎడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.